# అసలు కథ ఏంటో!?


బాలకృష్ణ

వరుస విజయాలతో దూసుకుపోతున్నారు నందమూరి బాలకృష్ణ. ప్రస్తుతం మాస్ సినిమాకు కేరాఫ్ అడ్రెస్‌గా నిలిచారాయన. చిన్నాపెద్దా తారతమ్యం లేకుండా దర్శకులందరూ ఆయన కోసం కథలు రెడీ చేసుకునే పనిలోవున్నారు. ప్రస్తుతం బాలయ్యను డైరెక్ట్ చేసే ఛాన్స్ డైరెక్టర్ బాబీ కొల్లిని వరించిన విషయం తెలిసిందే. వర్కింగ్ టైటిల్ 'NBK 109' పేరుతో తెరకెక్కుతున్న ఈ చిత్రం షూటింగ్ బుధవారం మొదలైంది. ఈ సందర్భంగా కథనూ, అందులోని హీరో కేరక్టరైజేషన్‌నూ తెలియజేసే రీతిలో సృజనాత్మకంగా ఓ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. పదునైన గొడ్డలి, ఆ గొడ్డలికి వేళ్లాడుతున్న ఓ తాయెత్తు, ఆ గొడ్డలికి తగిలించిన ఓ కళ్లజోడు. ఆ కళ్లజోడులో కనిపిస్తున్న భయంకరమైన రూపాలు.. ఏదో కథ చెబుతున్నట్టు ఈ పోస్టర్ ఉంది. మరి అసలు కథేంటో తెలియాల్సి వుంది. ప్రస్తుతం ఈ పోస్టర్ చర్చనీయాంశమైంది. సినిమాపై ఆసక్తిని కూడా రేకెత్తించింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రానికి సమర్పణ శ్రీకర స్టూడియోస్. ఈ సినిమాకు సంబంధించిన మిగతా వివరాలు తెలియాల్సివుంది.



## పాటతో మనసుల్ని టచ్ చేశాడు

తమిళ హీరో కార్తీ తెలుగు చక్కగా మాట్లాడతారన్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఏకంగా పాటే పాడేశారు. ఆయన రాబోతున్న 'జపాన్' సినిమాలో 'టచ్చింగ్ టచ్చింగ్..' అంటూ జి.వి.ప్రకాశ్ కుమార్ స్వరపరిచిన పాటను ఇంద్రావతి చౌహాన్‌తో కలిసి పాడేశారు కార్తీ. కార్తీ వాయిస్ ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని సంగీత దర్శకుడు జి.వి.ప్రకాశ్‌కుమార్ అన్నారు. మాస్ మెచ్చే విధంగా భాస్కరభట్ల రచించిన ఈ పాట సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని దర్శకుడు రాజు మురుగన్ చెప్పారు. 'జపాన్' కథ, కార్తీ గెటప్, ఆయన మేనరిజమ్స్, అను ఇమ్మాన్యుయేల్‌తో కార్తీ కెమిస్ట్రీ ఇవన్నీ సినిమాను ప్రధాన బలాలని ఆయన అన్నారు. కేఎస్.రవికుమార్, సునీల్, విజయ్ మిల్టన్ ప్రత్యేకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా ఎస్.రవివర్మన్. నిర్మాతలు ఎస్.ఆర్.ప్రకాశ్‌బాబు, ఎస్.ఆర్.ప్రభు.


మృణాళ్ ఠాకూర్

## యువరాణి శివగామిగా నటించా

మృణాళ్ ఠాకూర్ క్రేజ్ ప్రస్తుతం మామూలుగా లేదు. 'సీతారామం' తర్వాత ఆమె కెరీరే మారిపోయింది. ప్రస్తుతం చేతినిండా సినిమాలతో బిజీబిజీగా ఉంది. నానితో ఆమె నటించిన 'హాయ్ నాన్న' డిసెంబర్‌లో రానుంది. అలాగే మెగాస్టార్ చిరంజీవి హీరోగా వశిష్ట తెరకెక్కించే సోషియో ఫాంటసీ సినిమాలో కూడా ఓ హీరోయిన్‌గా మృణాళ్ సెలక్టయినట్టు విశ్వసనీయ సమాచారం. ఇదిలావుంటే ఇటీవల మృణాళ్ ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన విషయాలు మాట్లాడింది. 'నా కెరీర్ ఇప్పుడు బావుంది. నేను ఏ తరహా సినిమాలు చేయాలని కోరుకుంటున్నానో అలాంటి సినిమాలే వరిస్తున్నాయి. అంతా 'సీతారామం' చలవే. నాకు ఫాంటసీ సినిమాలంటే ఇష్టం. వెబ్ సిరీస్ 'బాహుబలి బిఫోర్ ది బిగినింగ్' లో ఇప్పటికే పది ఎపిసోడ్స్ నటించాను. ఇందులో యువరాణి శివగామిగా నటించా. కానీ ఆ పాత్రను వామికా గబ్బి నటిస్తున్నట్లు మీడియాలో వార్తలొచ్చాయి. అందులో నిజంలేదు. ఆ సిరీస్ కోసం ఎంతో ఆశగా ఎదురుచూశా. కానీ విడుదల అవ్వలేదు. విడుదలైతే తప్పకుండా ప్రజాదరణ పొందుతుంది. సినిమాలే చేయాలని రూలేం పెట్టుకోలేదు. కథ నచ్చితే వెబ్ సిరీస్ చెయ్యటానికి కూడా సిద్ధం' అంటూ చెప్పుకొచ్చింది అందాలతార మృణాళ్ ఠాకూర్.


అమితాబ్‌బచ్చన్

## అందరూ చెప్పులు వదిలి మళ్లీ వేసుకున్నారు

ఎవరి మాటలైతే జనాలు ఎక్కువగా వినడానికి ఇష్టపడతారో అలాంటి వాళ్ల మాటలే వైరల్ అవుతూ వుంటాయ్. ఉదాహరణకు బిగ్ అమితాబ్‌బచ్చన్. ఆయన ఏ విషయం గురించైనా, ఎవరి గురించైనా నిర్మొహమాటంగా మాట్లాడతారు. ఆయన ఏ సందర్భంలో మాట్లాడినా అది దేశం మొత్తం వింటుంది. అది ఆయన మాటకుండే కెపాసిటీ. ఆయన వ్యాఖ్యాతగా వ్యవహరించే 'కౌన్‌బనేగా కరోడ్‌పతి' కార్యక్రమం 15వ సీజన్ నడుస్తున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో అల్లు అర్జున్‌కి సంబంధించిన ప్రశ్నను అడిగారు బిగ్‌బీ. ఈ సందర్భంగా 'పుష్ప' సినిమా గురించి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ' 'పుష్ప' అద్భుతమైన సినిమా. అందులో 'శ్రీవల్లీ' సాంగ్ నిజంగా చరిత్రే సృష్టించింది. చెప్పు వదిలేయడం కూడా వైరల్ అవ్వడం నా జీవితంలో తొలిసారి చూశా. ఆ పాటలో అల్లు అర్జున్ క్యాజువల్‌గా చెప్పు వదిలేసి తొడుక్కుంటారు. ఆయన్ను చూసి అందరూ కూడా అదే స్టెప్ వేశారు. అందరూ చెప్పు వదిలేసి మళ్లీ వేసుకున్నారు..' అంటూ నవ్వుతూ గుర్తు చేసుకున్నారు బిగ్‌బీ. ఓ విధంగా బన్నీకి ఇది గొప్ప ప్రశంసే అని చెప్పాలి.


రవితేజ

## వాస్తవికతకు అద్దం పట్టేలా

అటు సీనియర్ హీరోలకూ, ఇటు కుర్రహీరోలకూ మధ్య వారధి లాంటివారు రవితేజ. ఈ రెండు జనరేషన్లతో పోటీ పడుతూ దూసుకుపోతున్నారాయన. రవితేజ నటించి 'ఈగల్' చిత్రం సంక్రాంతికి విడుదల కానున్న విషయం తెలిసిందే. ఆ సినిమా తర్వాత ఆయన మలినేని గోపీచంద్ సినిమా చేయబోతున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఈ సినిమాలో రవితేజ పాత్ర అత్యంత శక్తిమంతంగా ఉంటుందట. రవితేజ, గోపీచంద్ కాంబినేషన్‌లో వచ్చిన 'క్రాక్' సినిమాను మించే స్థాయిలో ఈ సినిమా ఉండబోతుందని సమాచారం. 'క్రాక్' తరహాలోనే ఇందులోనూ విలన్ పాత్ర హీరోను ఢీకొనేలా ఉంటుదట. వాస్తవికతకు అద్దం పట్టేలా ఇందులోని కథ, కథనాలు సాగుతాయని వినికిడి. ఈ సినిమాకు సంబంధించిన మిగతా వివరాలు తెలియాల్సి వుంది.


మారేష్ శివన్, పాయల్ రాధాకృష్ణ, సాయి రాజేశ్, హెబ్బా పటేల్, దినేష్ తేజ్


మూలవిరాట్


కార్తీ, అను ఇమ్మాన్యుయేల్


పాయల్ రాజ్‌పుత్

## అమ్మకు చెప్పి వెక్కివెక్కి ఏడ్చాను

సినిమా ప్రమోషన్‌లో భాగంగా అప్పుడప్పుడు ఇంటర్వ్యూలు ఇవ్వడం కథానాయికలకు పరిపాటే. ఆ సందర్భాల్లో మీడియా నుంచి ఎదురయ్యే ప్రశ్నలు ఒక్కోసారి ఇరకాటంలో పడేస్తుంటాయి. కొందరు హీరోయిన్లు తెలివిగా సమాధానాలిచ్చేసి తప్పించుకుంటూవుంటారు, కొందరు హీరోయిన్లు మాత్రం సూటిగా సమాధానాలిచ్చేస్తుంటారు. పాయల్ రాజ్‌పుత్ రెండో టైపు. రీసెంట్‌గా తన సినిమా ప్రమోషన్లో భాగం ఆమెకు మీడియా నుంచి అనూహ్యమైన ప్రశ్న ఎదురైంది. చదువుకునే రోజుల్లో కానీ, చిత్ర పరిశ్రమలోకానీ మీకు క్రష్ ఎవరైనా ఉన్నారా? అనేది ప్రశ్న. దీనికి పాయల్ తడుముకోకుండా సమాధానమిచ్చేసింది. 'స్కూల్ డేస్‌లో ఓ అబ్బాయిని ఇష్టపడ్డాను. తను కనిపిస్తే చాలు గుండెల్లో బరువుగా ఉండేది. తెలీని బాధ. ఓసారి నేరుగా ప్రపోజ్ చేశాను. తను నిర్మొహమాటంగా రిజెక్ట్ చేశాడు. అప్పుడు నా బాధ వర్ణనాతీతం. తిండి కూడా సహించేదికాదు. అమ్మకు చెప్పి వెక్కివెక్కి ఏడ్చాను. ఆ బాధతోనే ఎగ్జామ్‌లో కూడా ఫెయిల్ అయ్యాను' అంటూ చెప్పుకొచ్చింది పాయల్.


డాలీషా, సుడిగాలి సుధీర్

## కనుల నీరు రాలదే

సుడిగాలి సుధీర్ హీరోగా రూపొందుతోన్న చిత్రం 'కాలింగ్ సహస్ర'. డాలీషా కథానాయిక. అరుణ్ విక్కిరాలా దర్శకుడు. విజేష్ తయాల్, చిరంజీవి పమిడి, వెంకటేశ్వర్లు కాటూరి నిర్మాతలు. ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రంలోని 'కనుల నీరు రాలదే..' అంటూ సాగే గీతాన్ని మేకర్స్ విడుదల చేశారు. మోహిత్ స్వరపరిచిన ఈ గీతాన్ని సుద్దాల అశోక్‌తేజ రచించారు. ఈ సినిమాతో సుధీర్ తప్పకుండా పెద్ద హీరో స్థాయికి ఎదుగుతాడని, సాంకేతికంగా సినిమా అద్భుతంగా ఉంటుందని, రాజీపడకుండా సహకరించిన నిర్మాతలకు కృతజ్ఞతలని దర్శకుడు చెప్పారు. సినిమా అద్భుతంగా వచ్చిందని, భారీగా విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నామని బెక్కెం వేణుగోపాల్ తెలిపారు.

## నిజానికి దగ్గరగా ఉండే కథ

దినేష్ తేజ్, హెబ్బాపటేల్, పాయల్ రాధాకృష్ణ ప్రధానపాత్రలో తెరకెక్కిన చిత్రం 'అలా నిన్ను చేరి'. మారేష్ శివన్ దర్శకుడు. కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మాత. ఈ నెల 10న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. అతిథిగా విచ్చేసిన 'బేబీ'దర్శకుడు సాయిరాజేశ్ సినిమా ఘనవిజయం సాధించాలని చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. ప్రతి ఒక్కరి జీవితంలో జరిగే సంఘర్షణే ఈ చిత్రమని, దర్శకుడు ప్రాణంపెట్టి ఈ సినిమా తీశాడని, తప్పకుండా అందరికీ నచ్చే సినిమా అవుతుందని నిర్మాత చెప్పారు. 'ఇది నిజానికి దగ్గరగా ఉండే కథ. దానికి తగ్గట్టే అందరూ సహజంగా నటించారు. సాంకేతికంగా కూడా అద్భుతంగా ఉంటుంది సినిమా. సుభాష్ ఆనంద్ సంగీతం, చంద్రబోస్ సాహిత్యం ఈ ప్రేమకథకు ప్రధాన బలాలు. పనిచేసిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్ చెప్పుకుంటున్నా' అని దర్శకుడు అన్నారు. ఇంకా యూనిట్ సభ్యులందరూ మాట్లాడారు.

## అవిశ్రాంత యోధుడా..

ప్రజాకవి కాళోజీ బయోపిక్ తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. మూలవిరాట్, పద్మ, రాజ్‌కుమార్ , స్వప్న ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి ప్రభాకర్ జైనీ దర్శకుడు. విజయలక్ష్మి జైనీ నిర్మాత. ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకొని విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా ఎస్.ఎస్.ఆత్రేయ స్వరపరిచిన 'అలుపెరగని అవిశ్రాంత యోధుడా..' అంటూ సాగే ఈ చిత్రంలోని పాటను ప్రముఖ నిర్మాత డి.సురేశ్‌బాబు విడుదల చేశారు. మహనీయుడు కాళోజీ జీవితాన్ని తెరకెక్కించిన దర్శక, నిర్మాతలిద్దరూ ధన్యులని, ఈ టీమ్ మొత్తానికి మంచి పేరు రావాలని, సినిమా ఘన విజయం సాధించాలని సురేశ్‌బాబు ఆకాంక్షించారు. సినిమా చూసిన సెన్సార్ సభ్యులందరూ అద్భుతంగా ఉందని ప్రశంసించారని జైనీ ప్రభాకర్ చెప్పారు. పాటలు రాసే అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు గీత రచయిత బిక్కి కృష్ణ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ చిత్రానికి కెమెరా: స్వర్గీయ రవికుమార్ నీర్ల, నేపథ్య సంగీతం: మల్లిక్ ఎం.వి.కె, నిర్మాణం జైనీ క్రియేషన్స్.





